# బావ...

## అమరావతి

**బావ ఎంత మంచివాడు!**

**అప్పుడెప్పుడో.. అవును. చిన్నప్పుడే.. అది చిన్నప్పుడెందుకైంది!? నాకూ పద్దెనిమిదేళ్లు వెళ్లాయి. వయసు నెత్తికెక్కింది... అప్పుడే చెప్పాడు.**

"నీకూ నాకూ రాసి పెట్టుంది. మనిద్దరం ఏడు జన్మల నుంచి ఆలు మగలమే. నేనిప్పుడే చదువు కోసం బెనారస్ వెళ్లినా, చదువు పూర్తయ్యాక ఇంకో దేశం వెళ్లినా, నువ్వే నా గుండెల పీటల మీద కూర్చుండే దేవతవి. పదేళ్లు కానీ, పన్నెండేళ్లు కానీ, నిన్ను తప్ప ఇంకో ఆడదాన్ని చేత్తో ముట్టుకోను. మనస్సులో పెట్టుకోను. నేను అందుబాట్లో లేనని మావయ్య నీకు ఏవేవో పిచ్చివీ పుచ్చువీ సంబంధాలు తెస్తాడు. నువు దేనికీ వొప్పుకోకు. నీకు నేనున్నాను." అభయమిచ్చాడు.

బావ ఈ మాటలు అని అప్పుడెప్పుడో వెళ్లాడు. బావ అన్నట్టే నాన్న ఈయన్ని మాటాడి పెళ్ళి చేసేశాడు. ఎన్నాళ్లు ఎన్ని సాకులు పెట్టి తప్పించుకుందామనిచూసినా నా మాట నెగ్గలేదు. "వాడి మొహం, వాడికి పై దేశాల డబ్బు మీద మోజు. వాడు రావడం, నిన్ను పెళ్లాడడం, .... ఓ! అన్నీ నీళ్లమీద రాతలు. అద్దంలో మూటలు. ఈ లోపుని నువ ముసిలైపోయి మూలకి చేరుతావు. నేను లోకమే విడిచి వెళ్లిపోతాను. అప్పుడు నువ్వు ఎవడికో దాసీదానిగా కాకపోతే నానోటితో నేననకూడదు గానీ ఎవడికో ఉంపుడుకత్తెగా బతుకు ఈడ్వవలసి వస్తుంది.." అంటూ భయపెట్టేవాడు.

...అమ్మ ఉంటే కొంచెమైనా అడ్డుపడేది. ఎంత చెడ్డా బావ అమ్మకి మేనల్లుడే కదా. అమ్మ ఉంటే నాన్న ఇలా ఎంత ఈసడించినా, నా పక్షాన్ని ఒక కొమ్ము కాసుండేది. చాలాకాలంనాడే "పొండి, మీ సాకులూ మీరూనూ! ఎదురు మేనరికం అయితే నేంగాక, నానిగాడు ఎంత ప్రయోజకుడౌతాడో మీకేంతెలుసు!? పరీక్షలకెళ్లినా పందేలకెళ్లినా ఫస్టొచ్చేది వాడేకదా. వయసొచ్చింది అంటారు గాని మన పిల్లకంటే పదేసేళ్లు పెద్దవాళ్లు ఇంకా పెళ్లిళ్లు కానివాళ్లు మన బంధువుల్లోనే డజనుమందున్నారు." అంటూ అమ్మ చేసే వాదన మోటుగా ఉండదు. నిజాయితీగానే ఉంటుంది. అందుచేతనే కదా నాన్న నాకు తెచ్చిన సంబంధాలు నాలుగూ వల్లకాదంది. ఈయన సంగతి వచ్చేసరికి అమ్మ పోయి ఎనిమిది నెలలు. ఏడాది లోపల కన్యాదానం చేస్తే ఆవిడకి పరలోకంలో మంచి యోగ్యత కలుగుతుందని అందరూ నాన్నని ఊదరకొట్టేరు. నాకప్పటికి ఇరవైనాలుగు వెళ్లేయి. కాని, నాకు అది బాల్య వివాహమే. 'పెళ్లి చేస్తాను. నీకు ఆ అబ్బాయి నచ్చాడా'– అని కూడా అడక్కుండా తూ తూ మంత్రం చేసేశారు.

***

బావ జెర్మనీ నుంచి కిందటి నెలే వచ్చాడుట. ఈ ఊళ్లో పనుండి వచ్చాడుట.

"బావున్నావా" అన్నాడు.

"ఊఁ" అన్నాను.

"మీ ఆయన ఏడీ?"

"ఉదయం ఎనిమిదింటికే... వెళ్లిపోతారు. పన్నెండున్నరకొస్తారు. ఒంటి గంటన్నర కెళతారు. ఆరు గంటలకొస్తారు.

"ఏం ఉద్యోగం?"

"నాకా పేర్లు తెలీవు. జనరల్ డ్యూటీ అంటారు. ఒక్కొక్కప్పుడు ఆదివారాలూ పండుగలూ కూడా ఉండవు.'


"దానివల్ల డబ్బులు ఎక్కువిస్తారేమో?"

"అవును. రెండురెట్లు ఇస్తారు. అంతే కాదు. సంక్రాంతీ ఆదివారమూ కలిసొచ్చి ఆ వేళ డ్యూటీ పడితే రెండు రెట్లు డబ్బా ఇస్తారు. ఎప్పుడైనా దానికి బదులు రెండు రోజులు సెలవు కూడా ఇస్తారు."

"ఏం కంపెనీ అది?"

"అమ్మో. ఈ ఊళ్లో ఉన్న అన్ని కంపెనీల్లోనూ అదే పెద్దదిట.. జి.ఎమ్.కె. కంపెనీ."

"చంపేశావు. నేనిప్పుడు వొచ్చింది ఆ కంపెనీ పనిమీదే. వాళ్ళు ఇప్పుడు రాగి,



తగరం, సీసం కలిపిన లోహం ఒక దాంతో కొన్ని సెట్టింగులు చేస్తున్నారు. రెండేళ్లలో స్టీల్, అల్యూమినియం మౌల్డులు చేస్తారట. ఆ కొత్త ఫేక్టరీకి కావలసిన ప్లాన్లూ ఆలోచనలూ చెప్పమని నన్నిక్కడికి పిలిచారు. నెలరోజుల పని. రోజుకి పదహారు వందలిస్తారు. వాళ్ల గెస్టు హౌస్‌లో ఉంటున్నా.''

...బావ గురించి ఈయనకి చెప్పాను. ''ఏమో కంపెనీ పనిమీద వారానికి ఒకడు చొప్పున ఏడాది పొడుగుతా ఎవరో ఒకరు- సైంటిస్టులు, ఆర్గనైజర్లు, ఆఫీసర్లు, కష్టమర్లు- వస్తూనే ఉంటారు. ఆ శతకోటి బోడిజంగాల్లో మీ బావ కూడా ఒకడేమో!''

ఆయన బావని గురించి అలా అనడం నాకు నచ్చలేదు. ఈ కంపెనీ కొత్త విభాగానికి పెట్టుబడి రెండు వందల కోట్లు - అని బావ చెప్పాడు. కాశీలో లోహాలకి సంబంధించిన ఇంజినీరింగు చదువుకొని, ఆ చదువు సహాయంతో ఎక్కడెక్కడ ఎలాంటి ఎలాంటి ఫేక్టరీలు పెట్టొచ్చో కాగితాల మీదా, స్థలాల మీదా అరటిపండు వొలిచి చేతిలో పెట్టినంత స్పష్టంగా చెప్పగలడు బావ. ఇప్పటికి ఎన్ని చిన్న కంపెనీలను పెద్ద పెద్దవిగా చేయించేడో చెప్తే గుండె జల్లుమంటుంది.

ఇరాన్ అనీ ఒక దేశం ఉందిట. అక్కడ పెట్రోలు బాగా దొరుకుతుందట కానీ, పంచదార పై దేశాల నుంచి తెప్పించుకోవాలట. అయితేనూ అక్కడ ఖర్జూరం బాగా పండుతుందట. బావానూ, ఇంకొక కెమికల్ ఇంజనీర్నూ, కలిసి ఖర్జూరం లోంచి పంచదార తీసే సూత్రం చెప్పి యంత్రాలు తయారుచేయించి వాళ్లకి ఎంతో మేలు చేసేరుట. రెండేళ్ళు కష్టపడి చేసిన ఆ పనికి ఇద్దరికీ ఖర్చులు కాక చెరో పాతిక లక్షలూ ఇచ్చారుట. అలాంటి బావని పట్టుకుని బోడిలింగం, గాడిద పాట, అంటే అది ఏమి మర్యాద?

''మీ ఆయన్ని చూశానివాళ..'' అన్నాడు బావ.

ఉదయం పదకొండు గంటలప్పుడు ఈయన పనిచేసే 'వింగు'కి వెళ్లాడుట. ఆ వింగులో నూట ఎనభై మంది ఉన్నారట. పనిమీద ఏకాగ్రత, యంత్రం మీద దృష్టి తప్పడానికి వీల్లేని పని. ఈయన పేరు బావ నిన్న ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పేను కదా! అక్కడి వాళ్లని ఆపేరుగల మనిషి ఎవరూ అని అడిగితే, ఈయన పని చేస్తున్న వింగుకి తీసికెళ్లి చూపించారుట.

''హలో ఈశ్వర్, ఎలా ఉన్నారు?'' అని బావ పలకరిస్తే ఒకే ఒక్క రెప్పపాటు సమయం బావని చూసి 'ఓకె' అన్నారట.

... ఎవరండీ మీరు? నా యోగక్షేమం అడిగేరు సంతోషం- అని రెండు మాటలు కొరకొచ్చు కదా. ఏమిటో ఈ మనిషి!

బావ నా సంసార పరిస్థితులూ అత్తవారి ఆదరణా ఎలా ఉన్నాయని చాలా ఆప్యాయంగా అడిగేడు... బావ రోజూ ఈయన పని చేస్తున్న ఫేక్టరీలో ఉన్న వింగులు, ఆఫీసు యంత్రాంగం గమనించి ముఖ్యమైన కాగితాలు- పరిశీలించి భోజనానికి, గెస్టుహౌస్‌కి మధ్యాహ్నం రెండున్నరకి వెళ్తున్నాడు. దారిలోనే ఈ ఇల్లు. రోడ్డుమీద కారాపి లోపలికొస్తాడు. ''నీ చేత్తో చల్లటి మంచినీళ్లు ఇయ్యి పద్మా'' అని కుర్చీలో కూర్చుంటాడు. ఐదు నిముషాలు మాట్లాడి వెళ్ళిపోతాడు.

''మరీ రెండున్నరకి భోజనమేమిటి బావా?'' అని నేనంటే ''ఏమో! వేళ తప్పిన భోజనం లాగా ఈడు తప్పిన పెళ్లికూడా నాకు రాసి పెట్టుందేమో!'' అన్నాడు.

నా గుండె జల్లుమంది. బావ బెనారస్ చదువుకి వెళ్ళే ముందే- ''పదేళ్లు కాదు, పన్నెండేళ్లయినా సరే నా కోసం ఆగు.'' అన్నాడు. నేనే భ్రష్టజాతకిని. ఆగేను కాదు.

***

నేను దాచినా నా సంసారం సంగతులు బావ దగ్గిర దాగలేదు. నా మావగారు కర్కోటకుడు. ఈ కంపెనీకున్న ఆరు వింగుల ఉద్యోగస్తులకీ నెలలో ఆరు వేరే వేరే తేదీలలో జీతాలు ఇస్తారు. మా వంతు పదకొండో తారీకు. ఒక వేళ పదకొండు ఆదివారం అయితే పన్నెండున ఇస్తారు. మావగారు ఆ రోజు నాడు వచ్చి ఈయన జీతం అంతా తీసేసుకుంటారు. ఇంటద్దె పచారీ కొట్టు బాకీ- ఆయనే వాళ్లకి ఇచ్చేస్తారు.

''నీకు కిందటి నెల ఓవర్ టైము ఎనిమిది రోజుల జీతం పదహారో తారీకున ఇస్తారు కదా.'' అని ...'' అదే సర్దుకొండి.'' అనే ధోరణిలో నచ్చచెప్పి వెళతారు. ఎంతో దూరం లేదు. పధ్నాలుగు మైళ్ళు. అక్కడ మనిషి సాయం ఎలాంటిది కావలసి వచ్చినా నన్ను రప్పించుకుంటారు.

అత్తగారికి తీరని నడుం నొప్పి. ఆడపడుచు ప్రతి రోజూ టౌనుకి ఉద్యోగానికి వెళ్లిపోతుంది. ఆవిడ పిల్లలిద్దరూ ఇక్కడే ఉంటారు. ఆయన లేడు. పగలనక రాత్రనక వాళ్లనీ, అత్తగార్నీ చూసుకోవాలి. మావగారు నిత్యాగ్నిహోత్రుడు. అయిపోయిన సిగరెట్టుతో మరోటి వెలిగించుకుంటాడే తప్ప అగ్గిపెట్టె అడగడు. ఆయన దగ్గడు, మనకి దగ్గొస్తే ఊరుకోడు. అక్కడ ఎలా లేదన్నా నెలకి ఇరవైరోజుల సేవ ఉంటుంది. అక్కడుండగా వాకిట ఉంటే ఇంటికి దిగబెట్టేస్తారు. ఈయన మనస్సన్యాసి. ఉన్నావా అనరు. ఎలా ఉన్నావు అని అసలే అనరు. నాకు ఏదైనా బాధ వస్తే వండనైనా వండేస్తారు. లేదా ఎక్కడికో వెళ్లి గుప్పెడు తెచ్చిపడేస్తారు. మాటలు ఉండవు. రాత్రులైనా సరే ముచ్చట్లు ఉండవు. ముద్దులు అసలే ఉండవు. అంత అలసట. ఎప్పుడైనా ఒక స్నేహితుడు వస్తే అతగాడిని కూర్చోబెట్టి వడ్డనలు చేయించుకుంటారు. ఆ వచ్చే అతను ఎప్పుడూ ఒకడుగా ఉండడు. కాని అందరూ ఆడేది ఒకటే మాట. ''మీ ఆయన కష్టజీవి చెల్లెమ్మా. ఆయనకి డ్యూటీ మొదటి భార్యా, నువ్వు నెంబరు టూ. ఓవర్ టైం మీద ఉన్న ఆసక్తి ఇంటి మీద ఉండదు.''

ఆడపడుచుకి నలభై దాటాయి. ఆవిడ పట్నంలో విడిగా ఉండి తన ఉద్యోగం తన పిల్లల పోషణా చూసుకుంటే నా అత్తగారూ మామగారూ నా దగ్గరికే వచ్చేసి మంచీ చెడ్డా మాతో బాటే అనుభవించవచ్చు. కాని ఈయన వాళ్లకి ఆ సలహా ఇవ్వరు. ఇచ్చినా వాళ్ళుపాటించరు.

నేను ఉన్నాను, ఇలా ఉన్నాను. చీడగాని సిరిగాని అంటీ అంటనట్టుగా ఉన్నా. మనస్సు, మాట కుదించుకుపోయి ఉన్నాను.

బావ ప్రతిరోజూ కాదు గాని వారానికి ఐదు రోజులు రోజుకి ఐదు నిముషాలు చొప్పున పగలు రెండు గంటల వేళప్పుడు వచ్చి నా మనస్సుని నా మీద అతనే వొలకబోసి వెళుతున్నాడు. ''నీకు అందరూ ఉండీ ఎవ్వరూలేని దానివిగా ఉన్నావు. నాకు నువ్వు తప్ప ఎవరూలేని వాడినిగా ఉన్నా. నూతిలో పడిపోయిన బంగారు నగ తీసుకుంటామే కాని వదిలేసుకుంటామా. ఆలోచించి చూసుకో. ఓంకారం లోంచి నాదం వస్తుందా? సున్నాలోంచి అనంతమైన అంకెలు వస్తాయా? అని సంకోచించకు..'' ఇక్కడ నువ్వేమీ సుఖపడ్డంలేదు. నువ్వు నా ఇల్లాలివి కావాలనుకుంటే మీ ఆయనకేమీ నష్టం కష్టం కలక్కుండా నేను చూసుకుంటాను- అనేదంతా సూచనగానేకాక స్పష్టంగానే చెప్పేడు.

బాగానే అనిపించింది. బావతో నేను వెళిపోతే ఈయన ''అదేమీ'' అని అడగడు. అలా నిరంతరం ఫ్యాక్టరీలోని చక్రంలా తన పని తాను చేసుకుపోతారు. ఆయనకు ఇతరుల సుఖమే కాదు...తన సుఖం కూడా తెలియదు. తెలియనప్పుడు తెలియ చెప్పాలేమో.

''నేను వచ్చిన పని అయిపోయింది. ఈ రాత్రి ఎనిమిది గంటలకి వెళ్లిపోతున్నాను. నీ ఇంటి ముందు కారాపి నిన్ను పలకరిస్తాను. రాత్రి కనక లోపలికి రాను. ఇదిగో ఈ అరుగుమీద కూర్చో. ఎందుకైనా మంచిది. ఇంటికి తాళం పెట్టి తాళం ద్వారానికి తగిలించు. మీ ఆయనకి ఇవాళ రెండు గంటల పాటు ఓవర్ టైం తగిలే ఏర్పాటు చేసాను. ఎనిమిదిన్నరలోగా రాలేడు.''

***

రాత్రి.

పాపాలూ రోగాలూ తలలెత్తి విజృంభించేది రాత్రి పూటేనట.

ఏమో. ఇది పాపమా, రోగమా? తెలియదు. బావ చెప్పినట్టు అరుగు మీద కూర్చున్నాను. మాగన్ను పట్టింది.

నా చుట్టూ ఎంతో ఆదరంతో పులకరంతో అలుముకున్న చేతులు. కళ్ళు తెరుద్దామంటే సాధ్యం కావడం లేదు.

''వద్దు బావా. మా ఆయన సత్పురుషుడు. నేను బాగానే ఉన్నాను.'' అన్నాను.

''పద్మా. ఏమిటి ఇక్కడ కునికిపాటులు పడుతున్నావు?'' అని ఒక అలవాటైన ఊరటైన స్వరం. ఆ చేతులు నన్ను లేవనెత్తాయి.

లేవతీసుకుపోలేదు.

★

...బావ గురించి ఈయనకి చెప్పాను. ''ఏమో కంపెనీ పనిమీద వారానికి ఒకడు చొప్పున ఏడాది పొడుగుతా ఎవరో ఒకరు- సైంటిస్టులు, ఆర్గనైజర్లు, ఆఫీసర్లు, కష్టమర్లు- వస్తూనే ఉంటారు. ఆ శతకోటి బోడిజంగాల్లో మీ బావ కూడా ఒకడేమో!''